



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
బుధవారం
04-06-2025
పేజీలు: 02

## బంగారం ప్రియులకు గుడ్‌న్యూస్
# 15శాతం తగ్గే ఛాన్స్

కొద్దిరోజులుగా వరుసగా పెరుగుతూ వస్తున్న బంగారం ధర త్వరలో తగ్గబోతుంది. వచ్చే రెండు నెలల్లో డాలర్లపరంగా బంగారం ధర 12 నుంచి 15శాతం మేర తగ్గే అవకాశం ఉందని అంచనా. క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ తన నెలవారీ నివేదికలో ఈ విషయాన్ని తెలిపింది.ప్రస్తుతం దేశీయ మార్కెట్లో 10గ్రాములు 24 క్యారట్ల గోల్డ్ రేటు రూ.99,170 వద్ద కొనసాగుతుంది. 22 క్యారట్ల గోల్డ్ రేటు రూ.90,900 వద్ద కొనసాగుతుంది. అంతర్జాతీయ మార్కెట్లో మంగళవారం ఔన్స్ (31.10గ్రాములు) మేలిమి బంగారం ధర 3,350 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో నమోదైన 3,500 డాలర్లతో పోలిస్తే ప్రస్తుతం 150 డాలర్లు తగ్గింది.వచ్చే రెండు నెలల్లో బంగారం ధరలు తగ్గుతాయని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ తన నివేదికలో పేర్కొంది. గోల్డ్ రేటు ఎందుకు తగ్గుతుందనే కారణాలను కూడా వెల్లడించింది.



## ఈ విజయానికి ఆ ఇద్దరూ అర్హులే..
# విరాట్ కోహ్లీ భావోద్వేగం




ఎట్టకేలకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టైటిల్‌ను నెగ్గింది. అహ్మదాబాద్ వేదికగా పంజాబ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఆరు పరుగులతో విజయం సాధించింది. దాదాపు 18 సంవత్సరాల నిరీక్షణకు తెర దించుతూ తొలిసారిగా టైటిల్‌ను సాధించింది. ఈ విజయంతో జట్టు సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ భావోద్వేగానికి గురయ్యాడు. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 190 పరుగులు చేసింది. ఆ తర్వాత పంజాబ్ జట్టుకు శుభారంభం లభించినా.. ఆ తర్వాత తడబడింది. ముఖ్యంగా ఆర్‌సీబీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు విసిరారు. ముఖ్యంగా కృనాల్ పాండ్యా పంజాబ్‌ను ఇబ్బందిపెట్టాడు. పంజాబ్ బ్యాటర్లలో శశాంక్ సింగ్ 30 బంతుల్లో 61 పరుగులతో అజేయంగా నిలిచాడు. చివరి వరకు పంజాబ్‌ను గెలిపించేందుకు ప్రయత్నించినా అదృష్టం కలిసిరాలేదు. మ్యాచ్ గెలిచాక విరాట్ కోహ్లీ భావోద్వేగానికి గురై.. కన్నీళ్లు పెట్టుకున్నాడు.గతంలో మూడుసార్లు ఫైనల్‌కు చేరినా.. కప్ మాత్రం దక్కలేదు. ఈ సారి మాత్రం బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ అత్యుత్యమ ప్రదర్శన చేసి టైటిల్‌ను సాధించింది. మ్యాచ్ తర్వాత విరాట్ మాట్లాడుతూ.. ఈ విజయాన్ని ఆర్‌సీబీ అభిమానులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించాడు. జట్టులో తన సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నాడు. ఈ విజయం జట్టు సభ్యులతో పాటు 18 సంవత్సరాలు మద్దతు నిలిచిన ఆర్‌సీబీ అభిమానులదని.. తన యవ్వనం జట్టుకు ధారపోశానని, అనుభవం, విధేయతను జట్టుకు అంకితం చేశానని.. ఈ క్షణమే తనకు సర్వసమని విరాట్ పేర్కొన్నాడు. తన హృదయం, ఆత్మ రెండూ బెంగళూరుతోనే ఉన్నాయని.. తాను జట్టుకే విధేయుడిగా ఉన్నానని.. వేరే ఆలోచనలు వచ్చినా.. తాను వారితోనే ఉన్నానని.. వారు సైతం తనతోనే ఉన్నారన్నారు. ఈ విజయంలో గత కొన్నేళ్లు తనతో పాటు కలిసి ఆడిన ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్ సైతం సంబరాలు చేసుకునేందుకు అర్హులేనని పేర్కొన్నాడు. ఇద్దరు జట్టు కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశాడు విరాట్. ఈ మ్యాచ్ ప్రత్యేకమవుతుందని.. మ్యాచ్ ప్రారంభానికి ముందే ఏబీతో అన్నానని.. అతనితో కలిసి సంబరాలు చేసుకోవాలని భావించినట్లు చెప్పాడు.



## ప్యాకెట్ పాలను పదే పదే
# వేడి చేస్తున్నారా?

ఊళ్లలో ఉండే వాళ్ళు డైరెక్ట్ గా ఆవు, గేదె పాలు తాగే అవకాశం ఉంటుంది. కానీ, సిటీలో అది సాధ్యం కాదు. ప్యాకెట్ పాలనే వినియోగించాల్సిన పరిస్థితి. ప్యాకెట్ పాలను వేడి చేసి ఫ్రిజ్ లో నిలువ చేసుకొని వాడుకుంటారు. అయితే చాలా మందిలో ఉన్న సందేహం ఏంటంటే.. పాలను పదే పదే వేడి చేయొచ్చా ? అసలు పాలను వేడి చేయాల్సిన అవసరం ఏంటి ? అని. నిజానికి ఆవు, గేదె పాలను ఎందుకు వేడి చేస్తారు అంటే ? ఆ పాలలో బ్యాక్టీరియా ఉంటుందని నమ్ముతారు. పాలను వేడి చేయడం వల్ల అందులోని బ్యాక్టీరియా నశించి శుభ్రమైన పాలను తాగే వీలు ఉంటుంది. అందుకే పాలను వేడి చేయడం అనే పద్ధతి మొదలయ్యింది. మరి ప్యాకెట్ పాలను కూడా వేడి చేయడం అవసరమా అని చాలా మందిలో ఉన్న సందేహం. నిజానికి ప్యాకెట్ పాలను వేడి చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే.. పాలను ప్యాకెట్స్ లో ప్యాక్ చేయడానికి ముందే వాటిని శుద్ధి చేస్తారు. ఈ ప్రాసెస్ ను పాశ్చ్యారైజేషన్ అంటారు. ఈ పద్ధతిలో పాలను 135డీగ్రీల వద్ద 2 నుంచి 5 సెకన్ల పాటు వేడి చేస్తారు. అలా చేయడం వల్ల పాలలో ఉండే ఈకోలీ, లిస్టేరియా, సాల్మోనెల్లా వంటి హానికరమైన బ్యాక్టీరియాను తొలగిపోయి వాటి నిల్వ కాలం పెరుగుతుంది. అలా శుద్ధి చేసిన పాలను ప్యాక్ చేసి విక్రయిస్తారు. కాబట్టి ప్యాకెట్ పాలను పదే పదే వేడిచేయాల్సిన అవసరం లేదు. నేరుగా తాగవచ్చు. కాకపోతే కొంతమందికి వేడి పాలు తాగే అలవాటు ఉంటుంది కాబట్టి గోరువెచ్చగా చేసుకొని తాగితే సరిపోతుంది. ప్యాకెట్ పాలను పదేపదే వేడి చేయడం వల్ల అందులోని పోషకాలు కూడా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. పాలను ఎక్కువగా ప్రొటీన్, కాల్షియం కోసం వినియోగిస్తారు. వేడి చేయడం వల్ల అవి తగ్గిపోతాయి. కాబట్టి.. ప్యాకింగ్ కి ముందే పాలను శుద్ధి చేస్తారు కాబట్టి పాలను వేడి చేయాల్సిన అవసరం లేదు.

## ఐపీఎల్ విజేతలు
# వారికి దక్కిన అవార్డులు




ఐపీఎల్ 18వ సీజన్ విజేతగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలిచింది. పంజాబ్ కింగ్స్‌పై ఆరు పరుగులు తేడాతో విజయం సాధించి తొలిసారి కప్‌ను గెలిచింది. రజత్ పాటిదార్ నేతృత్వంలోని ఆర్‌సీబీ టైటిల్‌ని నెగ్గింది. ఈ మ్యాచ్ తర్వాత ప్రజంటేషన్ వేడుకల్లో విజేత ఆర్‌సీబీ, రన్నరప్ పంజాబ్ కింగ్స్‌తో పలువురు ఆటగాళ్లపై కాసుల వర్షం కురిసింది. ఐపీఎల్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు రూ.20 కోట్ల ప్రైజ్ మనీని ఇచ్చింది. అయితే, రన్నరప్ పంజాబ్ కింగ్స్‌కు రూ. 12.5 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. పంజాబ్ కోచ్, సపోర్ట్ స్టాఫ్ రన్నరప్ షీల్డ్, ఐపీఎల్ లిమిటెడ్ ఎడిషన్ వాచ్‌లను అందుకున్నారు. ఐపీఎల్‌లో ఖర్చు చేసిన మొత్తంతో లీగ్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ వస్తుంది. ఐపీఎల్‌లో విజేతలతో పాటు పలు అవార్డులు సైతం ఇచ్చే విషయం తెలిసిందే. ఇందులో ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్, ఫెయిర్ ప్లే అవార్డులు ఉన్నాయి. ఈ సారి ఆరెంజ్ క్యాప్ ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన గుజరాత్ టైటాన్స్ ప్లేయర్ సాయి సుదర్శన్‌కు దగ్గింది. ఈ సీజన్‌లో 759 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. ఇక మరో గుజరాత్ ప్లేయర్ ప్రసిద్ధ్ కృష్ణకు పర్పుల్ క్యాప్ దక్కింది. ఈ సీజన్‌లో 25 వికెట్లు పడగొట్టాడు. ఇద్దరికీ రూ.10లక్షల చొప్పున బీసీసీఐ క్యాష్ రివార్డును అందించింది.

**ఏ ఆటగాడికి ఏ అవార్డు వచ్చిందంటే..?**

జితేశ్ శర్మ (సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది మ్యాచ్) రూ.లక్ష రివార్డు
శశాంక్ సింగ్ (ఫాంటసీ కింగ్ ఆఫ్ ది మ్యాచ్) రూ.లక్ష రివార్డు
శశాంక్ సింగ్ (సూపర్ సిక్సర్స్ ఆఫ్ ది మ్యాచ్) రూ.లక్ష రివార్డు
ప్రియాన్స్ ఆర్యా (మ్యాచ్‌లో అత్యధిక ఫోర్లు) రూ.లక్ష రివార్డు
కృనాల్ పాండ్యా (గ్రీన్ డాట్ బాల్స్ ఆఫ్ ది మ్యాచ్) రూ.లక్ష రివార్డు
కృనాల్ పాండ్యా (మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్) రూ.5లక్షల పారితోషకం
సాయి సుదర్శన్ (ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్) రూ. 10 లక్షల రివార్డు
వైభవ్ సూర్యవంశి (సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్) టాటా కర్వ్ కారు విజేత
సాయి సుదర్శన్ ( ఫాంటసీ కింగ్ ఆఫ్ ది సీజన్) రూ.10 లక్షల రివార్డు
నికోలస్ పూర్ (సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్) రూ.10 లక్షలు
సాయి సుదర్శన్ (ది గో ఫోర్స్ ఆఫ్ ది సీజన్) రూ.10 లక్షలు క్యాష్ ప్రైజ్
మొహ్మద్ సిరాజ్ (గ్రీన్ డాట్ బాల్స్ ఆఫ్ ది సీజన్) రూ. 10 లక్షల రివార్డు
కమిండు మెండిస్ (క్యాచ్ ఆఫ్ ది సీజన్) రూ. 10 లక్షల క్యాష్ ప్రైజ్
ఫెయిర్ ప్లే అవార్డు (చెన్నై సూపర్ కింగ్స్) రూ.10లక్షల ప్రైజ్‌మనీ
ప్రసిద్ధ్ కృష్ణ (పర్పుల్ క్యాప్) రూ.10లక్షల రివార్డ్
సాయి సుదర్శన్ (ఆరెంజ్ క్యాప్) రూ.10లక్ష రివార్డ్
సూర్యకుమార్ యాదవ్ (మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్) రూ.15లక్షల రివార్డు
డీడీసీఏ (పిచ్ అండ్ గ్రౌండ్) రూ.50లక్షలు




## కొత్తగా మరో 276 మందికి కరోనా పాజిటివ్..
# 44కి పెరిగిన మృతుల సంఖ్య

దేశంలో కరోనా వైరస్ (Corona Virus) వ్యాప్తి కొనసాగుతోంది. కొత్తగా ఇవాళ దాదాపు 300 మందికి పాజిటివ్‌గా తేలింది. దీంతో దేశంలో కరోనా వైరస్ యాక్టివ్ కేసుల సంఖ్య 4,300 దాటింది.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ 276 కొత్త కేసులు వెలుగు చూశాయి. దీంతో ఇప్పటి వరకూ కొవిడ్ బారిన పడిన వారి సంఖ్య 4,302కి పెరిగింది. అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 1,373 కేసులు పాజిటివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత మహారాష్ట్రలో 510, గుజరాత్‌లో 461, ఢిల్లీలో 457, పశ్చిమ బెంగాల్‌లో 432, కర్ణాటకలో 324, తమిళనాడులో 216, ఉత్తర ప్రదేశ్‌లో 201 కేసులు పాజిటివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల్లో ఏడు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో నాలుగు, ఢిల్లీ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున కొవిడ్ (Covid-19)తో మరణించారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా వైరస్ కారణంగా మరణించిన వారి సంఖ్య 44కి పెరిగింది. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకూ 3,281 మంది డిశ్చార్జ్ అయ్యారు.





## దివ్య దర్శనం టోకెన్ల కౌంటర్లు మార్పు..

తిరుమల వెంకన్న దర్శనానికి దర్శనానికి వచ్చే భక్తులకు టీటీడీ ముఖ్య ప్రకటన చేసింది. శ్రీవారిమెట్టు వద్ద ఇచ్చే దివ్యదర్శనం టోకెన్ల జారీ కౌంటర్లను తాత్కాలికంగా అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్ కి మార్చాలని టిటిడి నిర్ణయించింది. ఈ మేరకు ఈ నూతన కౌంటర్లు శుక్రవారం సాయంత్రం నుండి అలిపిరి భూదేవి కాంప్లెక్స్ లో అందుబాటులోకి రానున్నాయని తెలిపింది. ఇదే అంశానికి సంబంధించి టిటిడి ఈవో శ్రీ జె. శ్యామలరావు మంగళవారం సాయంత్రం వర్చువల్ సమావేశం ద్వారా టిటిడి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సాధారణంగా శ్రీవారి మెట్టు మార్గం నుంచి కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులకు శ్రీవారిమెట్టు వద్ద దివ్యదర్శనం టోకెన్లు జారీ చేస్తారు. అయితే తాజాగా టీటీడీ తీసుకున్న నిర్ణయం ప్రకారం.. శ్రీవారి మెట్టు నుండి కాలినడకన వెళ్లే దివ్య దర్శనం భక్తులకు టోకెన్ల జారీ కోసం భూదేవి కాంప్లెక్స్‌లో తాత్కాలికంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 6వ తేదీ శుక్రవారం సాయంత్రం నుండి అక్కడే టోకెన్లు జారీ ప్రక్రియ కొనసాగనుంది. టోకెన్ల లభ్యత మేరకు ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన ప్రారంభం కానుంది. ఈ మేరకు తమ ఆధార్ చూపించి దివ్యదర్శనం టోకెన్లు పొందిన భక్తులు శ్రీవారి మెట్టులోని 1200వ మెట్టు దగ్గర స్కాన్ చేయించుకోవాల్సి ఉంటుంది.

## క్లాసిక్ లుక్‌లో
# రాశి సింగ్



2019లో 'జెమ్' సినిమాతో తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేసిన రాశి, ఆది సాయికుమార్‌తో 'శశి' చిత్రంతో గుర్తింపు పొందింది. ఆమె 'పోస్టర్', 'ప్రేమ్ కుమార్', 'భూతద్దం భాస్కర్ నారాయణ', 'ప్రసన్నవదనం' వంటి సినిమాల్లో మరియు 'పాపం పసివాడు' వెబ్ సిరీస్‌లో నటించింది. ప్రస్తుతం ఆమె శివ కందుకూరితో 'భూతద్దం భాస్కర్ నారాయణ' చిత్రంలో నటిస్తోంది.రాశి సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. టాలీవుడ్‌కి ఇటీవల ఎంట్రీ ఇచ్చిన కొత్త హీరోయిన్లలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. రాశి సింగ్ మొట్టమొదట "జెమ్" సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. అయితే ఈ ముద్దుగుమ్మ చిన్నప్పటి నుండి సీరియల్స్ చూసి యాక్టర్ కావాలని ఆసక్తి కలిగిందట.ఈ ముద్దుగుమ్మ 14 ఏళ్ల వయసులో ఓ కమర్షియల్ యాడ్ లో నటించింది ఈ ముద్దుగుమ్మ మొదటి లో ఎయిర్ హోస్ట్‌గా కెరీర్ ను ప్రారంభించింది.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ఫైనల్లో ఓటమి తరువాత శ్రేయాస్ కీలక కామెంట్స్





ఎట్టకేలకు ఆర్సీబీ 18 ఏళ్ల కల నెరవేరింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఐపీఎల్ విజేతగా నిలిచింది. ఐపీఎల్ 2025 ఫైనల్ మ్యాచ్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పంజాబ్ కింగ్స్ పై విజయం సాధించింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్ లో ఆర్సీబీ విక్టరీ కొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. 191 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్.. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులే చేసింది. ఫలితంగా ఆరు పరుగుల తేడాతో ఆర్సీబీ గెలుపొందింది.మ్యాచ్ అనంతరం పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ మాట్లాడుతూ ఓటమిపై కీలక కామెంట్స్ చేశాడు. ''నిజాయితీగా చెప్పాలంటే ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసింది. ఫైనల్లో ఓడినా మా కుర్రాళ్లు సందర్భానికి తగినట్లుగా ఆడారు. ఈ మ్యాచ్ లో ఓడాల్సింది కాదేమో. గత మ్యాచ్ లో 200 పరుగుల లక్ష్యం సులువుగా చేధించాం. కానీ, ఈ మ్యాచ్ లో ఆర్సీబీ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. ముఖ్యంగా కృనాల్ పాండ్యా అసాధారణ ప్రదర్శనతో మ్యాచ్ ను మలుపు తిప్పాడు. అతని అనుభవాన్ని ఉపయోగించి బౌలింగ్ చేశాడు. మా జట్టులో చాలా మంది కుర్రాళ్లు తొలి సీజన్ ఆడారు. అయినా వారు ఫియర్ లెస్ గేమ్ ఆడారు. వచ్చే ఏడాది టైటిల్ గెలిచే ప్రయత్నం చేస్తాం.'' అని శ్రేయాస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.శ్రేయస్ అయ్యర్ ఫైనల్ మ్యాచ్ లో పరుగులు రాబట్టడంలో విఫలం అయ్యాడు. కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు. చివరలో శశాంక్ (30 బంతుల్లో 61నాటౌట్) హాఫ్ సెంచరీతో చెలరేగినా.. ఫలితం లేకపోయింది. పంజాబ్ కి ఓటమి తప్పలేదు. జోష్ ఇంగ్లిస్ 23 బంతుల్లో 39 పరుగులు చేశాడు. ప్రభ్ సిమ్రాన్ సింగ్ 22 బంతుల్లో 26 పరుగులు చేశాడు. మరోవైపు ఆర్సీబీ బౌలర్లు కృనాల్ పాండ్యా 4ఓవర్లు వేసి కేవలం 17 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు, యష్ దయాళ్, జోష్ హాజెల్ వుడ్, రోమారియో షెఫర్డ్ తలాఒక వికెట్ పడగొట్టారు.




## పాకిస్థాన్‌పై పోరాటం.. హైదరాబాద్‌లో ఒవైసీ పోస్టర్లు!

హైదరాబాద్ నగరంలోని అనేక ప్రాంతాలలో మెట్రో పిల్లర్లపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పోస్టర్లు వెలిశాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన బ్యానర్లు ఏర్పాటు చేశారు ఎంఐఎం కార్యకర్తలు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఓవైసీ గళం.. శత్రు దేశాన్ని ధీటుగా ఎదుర్కొంటున్న నాయకుడు అని పేర్కొంటూ ఓవైసీని ఉద్దేశించి సారాంశంగా కొన్ని పోస్టర్లు సిటీ రోడ్లపై దర్శనమిస్తున్నాయి. పాకిస్థాన్ ఉగ్రదాడిని ఇంకా దేశం మర్చిపోలేదు. పహల్గామ్ ఉగ్రదాడికి కేంద్రం కూడా తీవ్ర స్థాయిలోనే స్పందించింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో శత్రుమూకల ఆట కట్టించింది.. వారి స్థావరాలను ధ్వంసం చేసింది.. ఎందరో టెర్రరిస్టుల ప్రాణాలు తీసి బదులు తీర్చుకుంది. ఈ క్రమంలోనే శత్రు దేశం పాకిస్థాన్ అరాచకాలపై భారత్ వాదనను ప్రపంచ దేశాల ముందు గట్టిగా వినిపించి హైదరాబాద్ చేరుకున్నారు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ. ఈ క్రమంలోనే ఓవైసీని ఉద్దేశిస్తూ హైదరాబాద్ నగరంలోని మెట్రో పిల్లర్లపై ఎంఐఎం కార్యకర్తలు, నేతలు పోస్టర్ల ద్వారా తమ అభిమాన నాయకుడిపై గౌరవాన్ని చాటుతున్నారు. ప్రపంచ దేశాల ముందు ఓవైసీ పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా తన పదునైన గళం వినిపించడంతో ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. శత్రువులకు సరైన విధంగా బుద్ధి చెప్పాలని, మరోసారి భారత్ వైపు కన్నెత్తి చూసే అవకాశం కూడా ఇవ్వకూడదని తనదైన శైలిలో ఓవైసీ భారతీయ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో వెలసిన ఓవైసీ పోస్టర్లు పార్టీ అభిమానులను, అనుచరులను మరింత ఉత్తేజితులను చేసేలా కనిపిస్తున్నాయి.

## సెమీ ఫైనల్లో సబలెంక, స్వియాటెక్



ప్రతిష్ఠాత్మకమైన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ అరిన సబలెంక (బెలారస్), ఐదో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్) సె మీ ఫైనల్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన సెమీ ఫైన ల్లో మాజీ నంబర్‌వన్ స్వియాటెక్ 61, 75 తేడాతో ఉక్రెయిన్‌కు చెందిన 13వ సీడ్ ఎలినా స్విటోలినాను ఓడించింది. తొలి సెట్‌లో స్వియాటెక్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఏ దశలోనూ స్విటోలినాకు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. తన మార్క్ ఆటతో అలరించిన ఇగా ఎలాంటి ప్రతిఘటన లే కుండానే సెట్‌ను దక్కించుకుంది. కానీ రెండో సెట్‌లో స్విటోలినా పుంజుకుంది. అద్భు త ఆటతో ఇగాకు గట్టి పోటీ ఇ చ్చింది. ఇద్దరు ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా శ్రమించారు. దీంతో పోరు ఆసక్తికరంగా సాగింది. కానీ చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడు కోవడంలో సఫలమైన ఇగా టైబ్రేకర్‌లో సెట్ ను గెలుచుకుని సెమీస్‌కు చేరుకుంది. టాప్ సీడ్ సబలెంక క్వార్టర్ ఫైనల్లో చెమటోడ్చి నెగ్గింది. చైనాకు చెందిన 8వ సీడ్ కిన్వెన్ జెంగ్‌తో జరిగిన పోరులో సబలెంక 76, 63తో వి జయం సాధించింది. ఆరంభం నుంచే పోరు హోరాహోరీగా సాగింది. ఇద్దరు ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డారు. దీం తో సెట్ టైబ్రేకర్ వరకు వెళ్లక తప్పలేదు. ఇందులో ఆఖరు వరకు ఆధిపత్యాన్ని చెలాయించిన సబలెంక సెట్‌ను దక్కించుకుంది. అయితే రెండో సెట్‌లో మాత్రం సబలెంకకు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురు కాలేదు. తన మార్క్ షాట్లతో చెలరేగి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఇక సెమీస్‌లో స్వియాటెక్‌తో సబలెంక తలపడుతుంది.



## రీల్స్ చేస్తుండగా విషాదం.. ఆరుగురు అమ్మాయిలు మృతి

ఒకప్పుడు టిక్‌టాక్ రీల్స్‌కు విపరీతమైన క్రేజ్ ఉండేది. టిక్‌టాక్‌లో ఫేమస్ కావాలన్న ఉద్దేశ్యంతో చాలా మంది పిచ్చి పిచ్చి పనులు చేసేవారు. ఈ నేపథ్యంలోనే ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఉన్నారు. ప్రతీ నిత్యం ఏదో ఒక న్యూస్ టిక్‌టాక్ విషాదాల గురించి వచ్చేది. టిక్‌టాక్ దేశంలో బ్యాన్ అయిన తర్వాత.. ఆ స్థానాన్ని ఇన్‌స్టాగ్రామ్ తీసుకుంది. ఇన్‌స్టాలో ఫేమస్ అవ్వాలని చిన్న పిల్లల దగ్గరినుంచి ముసలి వాళ్ల దగ్గరి వరకు ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా, ఓ ఆరుగురు అమ్మాయిలు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వీడియో చేస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. నదిలో మునిగి చనిపోయారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఉత్తర ప్రదేశ్, ఆగ్రా సమీపంలోని నగ్లా స్వామి గ్రామానికి చెందిన ఆరుగురు అమ్మాయిలు రీల్స్ వీడియో తీయడానికి యమునా నది దగ్గరకు వెళ్లారు. నది వారి ఇళ్లకు 800 మీటర్ల దూరంలోనే ఉంది.ఆ ఆరుగురు అమ్మాయిలు ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని నదిలోకి దిగారు. వీడియో తీసుకుంటూ ఉన్నారు. అనుకోని విధంగా ఓ అమ్మాయి లోతుగా ఉన్న ప్రదేశంలోకి వెళ్లింది. నీటిలో మునిగిపోతూ ఉంది. ఇది గమనించిన మిగిలిన వాళ్లు ఆమెను రక్షించడానికి ప్రయత్నించారు. వారు కూడా నీటిలో మునిగిపోయారు. అక్కడే ఉన్న ఓ ఇద్దరు అబ్బాయిలు వారిని రక్షిద్దామని అనుకున్నారు. వారి వల్ల కాలేదు. దీంతో ఆరుగురు అమ్మాయిలు నీటిలో కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు, పోలీసులు నది దగ్గరకు చేరుకున్నారు. నీటిలో కొట్టుకుపోయిన వారి కోసం గాలించారు. సంఘటన జరిగిన ప్రదేశం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఆరుగురు దొరికారు. వారిలో నలుగురు అప్పటికే చనిపోయి ఉన్నారు. మిగిలిన ఇద్దర్నీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు సీపీఆర్ చేయటంతో బతికారు. అయితే, కొన్ని గంటల తర్వాత వారు కూడా చనిపోయారు. చనిపోయిన వారిలో ముస్కాన్ అనే అమ్మాయికి కొన్ని రోజుల క్రితమే నిశ్చితార్థం అయింది. నవంబర్ నెలలో పెళ్లి ఉంది. ఇంతలోనే ఇలా జరిగింది. ఈ ఆరుగురు అమ్మాయిలు ఒకే కుటుంబానికి చెందిన వారు. అక్కాచెల్లెళ్లు అవుతారు. వీరి మృతితో కుటుంబంతో పాటు గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.






## అఖిల్ మూవిలో అనన్య పాండే


టాలీవుడ్ యువ హీరో అక్కినేని వారసుడు అఖిల్ తన కెరీర్‌లో ఒక్క బ్లాక్‌బస్టర్ హిట్ అయిన కొట్టాలని ఎంతగానో ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, తన తదుపరి సినిమాల విషయంలో అఖిల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆయన ఒక కొత్త దర్శకుడితో సినిమా చేస్తున్నాడు. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ తాజా చిత్రం పేరు 'లెనిన్'.ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా, అఖిల్ సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే నుంచి టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయగా.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ గ్లింప్స్ ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ ఉండగా.. ఆ సాంగ్‌ని బాలీవుడ్ నటి అనన్య పాండేతో చేయిస్తే బాగుంటుందని చిత్రబృందం అనుకుంటున్నట్లు సమాచారం.



## తప్పుడు ఇంజక్షన్ ఇవ్వడంతో ఐదుగురు మృతి

తప్పుడు ఇంజక్షన్ ఇవ్వడంతో ఐదుగురు రోగులు మృతి చెందారు. ఈ సంఘటన ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలో జరిగింది. స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. సాహిద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజ్ అండ్ ఆస్పత్రిలో రోగులు చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి ఐసియు, సర్జికల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఐదుగురు రోగులకు తప్పుడు ఇంజక్షన్లు వేయడంతో అక్కడే వారు కన్నుమూశారు. రెండు రౌండ్లు ఇంజక్షన్లు వేయడంతోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని బంధువుల ఆరోపణలు చేస్తున్నారు. ఆస్పతి ముందు మృతుల బంధువులు, రోగులు ధర్నాకు దిగారు.

## చౌటుప్పల్‌లో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం..



యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చౌటుప్పల్ మండలం కైతపురం వద్ద హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ట్రావెల్ బస్సు బ్రేక్ డౌన్ కావడంతో ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ తో పాటు ఓ ప్రయాణికురాలు మృతి చెందింది. మరో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సమయంలో ఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల పూర్తి వివరాలు తెలియరాలేదు. ప్రమాదంపై జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించారు.